# హామీలు నెరవేర్చకుంటే ఆందోళనలు ఉధృతం

## కాంగ్రెస్ తీరుపై బీజేపీ నేత రవికుమార్ ధ్వజం

- శేరిలింగంపల్లిలో తహశీల్దార్‌కు వినతిపత్రం




**ప్రజానావ, శేరిలింగంపల్లి**

ఆరు గ్యారంటీలు, అరవై ఆరు హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తక్షణమే వాటిని అమలు చేయాలని, లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు శేరిలింగంపల్లిలో మహా ధర్నా నిర్వహించారు. గచ్చిబౌలి, కొండాపూర్, లింగంపల్లి, హఫీజ్‌పేట్, మియాపూర్ డివిజన్ల నాయకులతో కలిసి స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

### హామీలు గాలికి..

ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఆరు అబద్ధాలు, అరవై ఆరు మోసాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ రెండేళ్లయినా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. తెలంగాణ



ఉద్యమకారులకు ఇరవై ఐదు వేల పింఛను, ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం ఏవని ప్రశ్నించారు. మహిళలకు నెలకు రెండు వేల ఐదు వందలు, పెళ్లికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామన్న మాటను నిలబెట్టుకోలేదన్నారు. ఉచిత బస్సులతో ఆటో కార్మికుల పొట్ట కొట్టారని, వారికి ఇస్తామన్న పన్నెండు వేల రూపాయల ఊసే లేదన్నారు.

### పోరాటం ఆపం

కొత్త రేషన్ కార్డులు, పెంచిన పెన్షన్లు, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు మంజూరు చేయలేదని విమర్శించారు. విద్యార్థులకు ఐదు లక్షల విద్యా భరోసా, స్కూటీ, నిరుద్యోగులకు పది లక్షల వడ్డీ లేని రుణం, నాలుగు వేల భృతి ఏమయ్యాయని నిలదీశారు. ప్రతి జిల్లాకు స్పోర్ట్స్ స్కూల్స్, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, బస్తీ పబ్లిక్ స్కూల్స్ వంటి హామీలన్నీ బుట్టదాఖలయ్యాయని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే వరకు ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, రాస్తారోకోలు చేస్తూ ప్రజల పక్షాన పోరాడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ స్థాయిల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి









- సాగులో సాంకేతిక మార్పులతోనే అధిక దిగుబడులు సాధ్యం
- తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా కిసాన్ మేళా
- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజానావ, మెదక్:**

మారుతున్న వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా రైతులు నూతన పద్ధతులను అవలంబిస్తూ ఆధునిక వ్యవసాయం చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కోరారు. బుధవారం కౌడిపల్లి మండలం తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవకుమార్ ఆధ్వర్యంలో అధిక సాంద్రత సాగుపై నిర్వహించిన కిసాన్ మేళా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేడుకలను ప్రారంభించారు.

### ప్రదర్శన స్టాళ్ల పరిశీలన

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ స్టాళ్లను కలెక్టర్ ప్రారంభించి పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతలు, పంటల నిర్వహణ విధానాలు, యంత్రాల వినియోగం, పంట రక్షణ చర్యలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆమె ఆసక్తిగా సందర్శించారు. అక్కడి విశేషాలను అడిగి తెలుసుకుంటూ రైతులతో ముచ్చటించారు.

### శాస్త్రీయ సాగుతోనే లాభాలు

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా పాలన తొంభై తొమ్మిది రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా కిసాన్ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు శాస్త్రవేత్తలు సూచించే ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా దిగుబడి పెంచుకోవచ్చని చెప్పారు. కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న శిక్షణలు, శాస్త్రీయ సూచనలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంట మార్పిడి ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు అధిక లాభాలు సాధించవచ్చని పేర్కొన్నారు.

### వాణిజ్య పంటలపై దృష్టి సారించాలి

జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ మాట్లాడుతూ రైతులు సంప్రదాయ సాగుతో పాటు వాణిజ్య పంటలపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. కార్యక్రమంలో వేయి మంది రైతులు పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లా గ్రంథాలయాల చైర్మన్ సుహాసిని రెడ్డి మాట్లాడుతూ రైతు లేనిదే మనుగడ లేదని, నష్టాలకు ఓర్చి భూమిని నమ్ముకున్న వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ సమస్యలను కూడా అధికారులే వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామకృష్ణ, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ నల్కర్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య, స్థానిక సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

# ఏఐసీసీ పరిశీలకుడిగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

## మహారాష్ట్ర డీసీసీ అధ్యక్షుల ఎంపిక బాధ్యతలు అప్పగింత

## కాంగ్రెస్ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపిన జుక్కల్ ఎమ్మెల్యే



**ప్రజానావ, జుక్కల్:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఏఐసీసీ పరిశీలకుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు అధిష్టానం బుధవారం వివరాలు వెల్లడించింది. 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మహారాష్ట్రలో డీసీసీ అధ్యక్షుల ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకుల నియామకాన్ని చేపట్టింది. దీంట్లో భాగంగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును ఏఐసీసీ పరిశీలకుడిగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ.. అధిష్టానం తనపై ఎంతో నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిందని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా విధులు నిర్వర్తిస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు లక్ష్మీకాంతారావు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజలకు మాజీ డిప్యూటీ మేయర్ ఉగాది శుభాకాంక్షలు

## సంతోషం, శాంతి, సమృద్ధి నిండాలని ఆకాంక్ష



**ప్రజానావ, హైదరాబాద్:**

తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకుని గ్రేటర్ హైదరాబాద్ నగర మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి నగర ప్రజలందరికీ హృదయపూర్వక ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగాది పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, శాంతి, సమృద్ధి నింపాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని కోరుకుంటూ, సమాజంలో సౌహార్ద వాతావరణం మరింత బలపడాలని తెలిపారు. అలాగే ఉగాది పండుగ మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. నగర అభివృద్ధి, ప్రజల సంక్షేమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ ఉగాది సందర్భంగా రాష్ట్రం, నగరం మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం

- 35మందిలో ఒక్కొక్కరికి రూ.2వేలు
- మరో 14 మందికి ఒక్కొక్కరికి రూ.4000 జరిమానా

**ప్రజానావ, వేములవాడ:**

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో 49 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని పోలీసులు కోర్టులో హాజరుపరచగా, వేములవాడ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెలువరించారు. ఇందులో 35 మందికి ఒక్కొక్కరికి రూ.2000 జరిమానా, మరో 14 మందికి ఒక్కొక్కరికి రూ.4000 జరిమానా విధించారు అని టౌన్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. అనంతరం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన వారికి ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఇకపై మద్యం తాగి వాహనాలు నడపబోమని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐ వీరప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి కేసుల్లో పట్టుబడిన వారికి వారి తల్లిదండ్రులు లేదా కుటుంబ పెద్దల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నామని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశమున్నదే కాకుండా, భవిష్యత్తులో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల సమయం లో పోలీస్ వెరిఫికేషన్‌లో సమస్యలు తలెత్తే అవకాశముందని సూచించారు. ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# బతికుండగానే చంపేశారు!



## సిరిసిల్ల జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం

## కలెక్టర్ కార్యాలయంలో నిజం తెలిసి షాక్‌కు గురైన బాధితురాలు

**ప్రజానావ, కోనరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. బతికే ఉన్న వృద్ధురాలిని రికార్డుల్లో మృతి చెందినట్లు నమోదు చేయడంతో, ఆమెకు రావాల్సిన ఆసరా పింఛన్ నిలిచిపోయిన ఘటన కలకలం రేపుతోంది. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన మాదాసు నర్సయ్య కొద్ది సంవత్సరాల క్రితం మృతి చెందాడు. అతనికి వస్తున్న వృద్ధాప్య పింఛన్‌ను తన పేరిట మంజూరు చేయాలని ఆయన భార్య నర్సవ్వ సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసింది. అయితే సంవత్సరాలు గడిచినా పింఛన్ మంజూరు కాలేదు. దీంతో నర్సవ్వ కలెక్టర్ కార్యాలయాన్ని ఆశ్రయించగా, అక్కడ ఆమెకు షాకింగ్ విషయం తెలిసింది. అధికారుల రికార్డుల్లో నర్సవ్వను మృతి చెందిన వ్యక్తిగా నమోదు చేసినట్లు వెల్లడైంది. ఈ కారణంగానే ఆమెకు పింఛన్ మంజూరు కాలేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తూ, తనకు న్యాయం చేసి పింఛన్ మంజూరు చేయాలని కోరుతోంది. ఇదిలాఉంటే అధికారుల నిర్లక్ష్యంపై స్థానికంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

# వేములవాడలో శాంతి సమావేశం



**ప్రజానావ, వేములవాడ:** రంజాన్ పండుగను పురస్కరించుకుని శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వేములవాడ పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ముస్లిం మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్‌డీపీఓ శ్రీనివాసులు, సీఐ వీరప్రసాద్, ఎస్ఐ ఎల్లగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు కూడా పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



తెలంగాణ బార్ కౌన్సిల్ ఎలక్షన్‌లో మొదటి మెంబర్‌గా, మెజారిటీతో గెలుపొంది మొదటిసారిగా కరీంనగర్ బార్ అసోసియేషన్‌కి వచ్చిన పొన్నం అశోక్ గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వేములవాడ సీనియర్ సివిల్ కోర్ట్ ఏజీపీ బొడ్డు ప్రశాంత్ కుమార్.

- ప్రజానావ, వేములవాడ

# జిల్లాలో సమృద్ధిగా గ్యాస్ సిలిండర్లు

**కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**వదంతులు నమ్మి భయాందోళనలకు గురికావద్దు**

**కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు.. హెల్ప్ లైన్ నంబరు ఏర్పాటు**



**ప్రజానావ, పెద్దపల్లి :**

జిల్లాలో ఎల్.పి.జి గ్యాస్ సిలిండర్లు స్టాక్ సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు అనవసర ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన జిల్లాలో గత రెండు రోజుల్లో సరాసరి కంటే 40 శాతం అధికంగా గ్యాస్ సిలిండర్ బుకింగ్స్ జరిగాయని, ప్రజలు భయాందోళనలతో గ్యాస్ సిలిండర్ బుక్ చేయవద్దని కలెక్టర్ కోరారు. మూడు నుంచి నాలుగు రోజుల వ్యవధిలోనే గ్యాస్ సిలిండర్ డెలివరీ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సమృద్ధిగా గ్యాస్ సిలిండర్ల స్టాక్ అందుబాటులో ఉందని, ఈ అంశాన్ని జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తుందని, ప్రజలు అనవసర భయాందోళనలకు గురి కావద్దని కలెక్టర్ పేర్కొన్నారు.

ఎల్.పి.జి సిలిండర్లను బ్లాక్ మార్కెట్ కు తరలించి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 12 కేసులు నమోదు చేసి 29 సిలిండర్లు సీజ్ చేయడం జరిగింది. జిల్లాలో 15 డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరుగుతుందని, వాటి డెలివరీలో ఏవైనా ఆటంకాలు ఎదురైతే జిల్లాలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ హెల్ప్ లైన్ నంబరు 08728 224045ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. గృహ సంబంధిత అవసరాలకు సరఫరా చేసే ఎల్.పి.జి సిలిండర్లను ప్రతి రోజు ఆర్డీఓలు, తహసీల్దార్లు, సివిల్ సప్లై అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎల్.పి.జి సిలిండర్ల సరఫరా పై వదంతులు నమ్మి ఆందోళన చెందవద్దని, గృహ వినియోగానికి, ఆసుపత్రులకు, విద్యా సంస్థలకు, వృద్ధాశ్రమాలకు, ప్రభుత్వ సంస్థలకు సరఫరా చేసేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు పెరిగేలా చూడాలని ఆదేశం**

**మెరుగైన చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బందిపై ప్రశంసలు**



**ప్రజానావ, పెద్దపల్లి:**


జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, వీటిని ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కోరారు. బుధవారం పెద్దపల్లి పట్టణంలోని జిల్లా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాతా శిశు విభాగం, రేడియాలజీ, గైనకాలజీ, లేబర్ రూమ్, నేత్ర వైద్య విభాగం, ఎముకల విభాగం, ఫార్మసీలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. మాతా శిశువులకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**అత్యాధునిక వైద్య పరికరాలు**

నేత్ర వైద్య విభాగంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఫాకో పరికరం పనితీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ పరికరం ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉందని, అవసరమైన వారు ఈ వైద్య సేవలను వాడుకోవాలని సూచించారు. నెలకు అరవై నుండి డెబ్బై వరకు ఎముకల శస్త్రచికిత్సలు విజయవంతంగా జరుగుతుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఫార్మసీలో మందుల నిల్వలు, పంపిణీ విధానాన్ని పరిశీలించి సంతృప్తి చెందారు. ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం కూర్చునే సామర్థ్యం పెంచాలని, వారి వస్తువుల భద్రతకు ప్రత్యేక వసతులు కల్పించాలని ఆర్ఎంఓకు సూచించారు. ఈ పర్యటనలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఆర్ఎంఓ డాక్టర్ విజయకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐ భార్య ఆత్మహత్య

**దాంపత్య కలహాలే కారణం?.. - కరీంనగర్ పోలీసు వర్గాల్లో కలకలం**



**ప్రజానావ, కరీంనగర్:** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో టూటౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఇంట్లో విషపూరిత గన్నేరు పప్పు దంచి తిన్న దివ్య తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో హైదరాబాదుకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించారు. దివ్య ఆత్మహత్యకు కొద్దిసమయం ముందు భర్త చంద్రశేఖర్‌తో వాగ్వాదం, ఘర్షణ చోటుచేసుకున్నట్లు సమాచారం. దాంపత్య కలహాలే ఈ ఘటనకు కారణమై ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ విషయంలో భర్తపై ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దివ్య స్వస్థలం కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సీతంపేట గ్రామం. చంద్రశేఖర్--దివ్య దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ సంఘటన కరీంనగర్ పోలీస్ వర్గాల్లో కలకలం రేపింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గాయత్రిలో మిన్నంటిన ఉగాది సంబరాలు

- **పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించిన అధ్యాపకులు**
- **స్వయంగా ఉగాది పచ్చడి తయారు చేసిన చిన్నారులు**




**ప్రజానావ, పెద్దపల్లి:**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గాయత్రి విద్యానికేతన్‌లో ముందస్తు ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉగాది పండుగ యొక్క ప్రాముఖ్యతను, విశిష్టతను అధ్యాపకులు వివరించారు. ఉగాది అనగా నూతన సంవత్సరానికి ఆరంభమని, ప్రకృతితో పాటు కాలచక్రంలో చోటుచేసుకునే మార్పులను అనుసరించి ఈ పండుగను జరుపుకుంటామని పిల్లలకు సులభంగా అర్థమయ్యే విధంగా తెలియజేశారు.

**షడ్రుచుల సమ్మేళనం**

ఉగాది పండుగలో ముఖ్యమైన ఉగాది పచ్చడి ప్రాముఖ్యతను వివరిస్తూ.. దానిలోని పదార్థాలు జీవితంలోని ఆనందం, దుఃఖం, కోపం, ఆశ్చర్యం వంటి అనుభవాలకు ప్రతీకలని చెప్పారు. అనంతరం విద్యార్థుల చేతనే ఉగాది పచ్చడిని తయారు చేయించి అందరికీ పంపిణీ చేశారు. ఈ ప్రక్రియ ద్వారా పండుగ సంప్రదాయాలను పిల్లలు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

**అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు**

ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ఉగాది పాటలు, భక్తి గీతాలపై నృత్య ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను అలరించారు. చిన్నారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో గాయత్రి విద్యానికేతన్ చైర్మన్ శ్రీనివాస్, కరస్పాండెంట్ రజిని, అధ్యాపక బృందం పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# రాజరాజేశ్వర దేవస్థానంలో ఫుడ్ సేఫ్టీ శిక్షణ

- **ప్రసాద తయారీ సిబ్బందికి ప్రత్యేక అవగాహన**
- **శిక్షణ అనంతరం పరీక్షల నిర్వహణ**
- **త్వరలో సర్టిఫికెట్ల జారీ**



**ప్రజానావ, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని ప్రసిద్ధ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, పోషకమైన ప్రసాదం మరియు ఆహారం అందించేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు మార్చి 18, 2026న దేవస్థానంలోని ప్రసాద తయారీ విభాగం మరియు నిత్యాన్నదాన కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ఆహార భద్రతా ప్రమాణాలు, పరిశుభ్రత, ఆహార తయారీ విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. శిక్షణ అనంతరం వారికి పరీక్ష కూడా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వారికి త్వరలో సర్టిఫికెట్లు జారీ చేస్తామని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు. ఇక దేవస్థానంలోని ప్రసాద తయారీ, నిత్యాన్నదాన సేవలను ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం త్వరలో పరిశీలించి "భోగ్ సర్టిఫికెట్" జారీ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష బృందం నిర్వహించగా, పర్యవేక్షకులు శ్రీకాంత్ చారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మూడెకరాల ప్రభుత్వ భూమి కాపాడిన హైడ్రా



**ప్రజానావ, హైదరాబాద్:**

నగరంలోని ఖైరతాబాద్ మండలం వెంగళరావునగర్‌లో ఉన్న సుమారు 3 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు కాపాడారు. మార్కెట్ విలువ సుమారు రూ.600 కోట్ల వరకు ఉండే ఈ భూమిపై జరుగుతున్న ఆక్రమణలను బుధవారం తొలగించారు. 1975కు ముందే సంబంధిత వ్యక్తులకు పరిహారం చెల్లించి హౌసింగ్ బోర్డు మొత్తం 45 ఎకరాల భూమిని సేకరించి 660 ప్లాట్లతో లేఅవుట్ అభివృద్ధి చేసింది. ఇందులో పార్కులు, ప్రజా అవసరాల కోసం కొన్ని స్థలాలను కేటాయించగా, ప్రధాన రహదారికి ఆనుకుని 5 ఎకరాల భూమిని ఖాళీగా ఉంచారు. అయితే, ఈ భూమిలో ఇప్పటికే సుమారు 2 ఎకరాలపై ఆక్రమణలు జరిగి శాశ్వత నిర్మాణాలు ఏర్పడ్డాయి. మిగిలిన 3 ఎకరాల భూమిపై పలువురు వ్యక్తులు హక్కులు చెబుతూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రా అధికారులు సంబంధిత వారితో సమావేశం నిర్వహించి వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించగా ఎవరూ సరైన ఆధారాలు చూపించలేకపోయారు. ఇదే సమయంలో ఈ భూమిపై వివాదం హైకోర్టులో కొనసాగుతుండగా స్టే కూడా అమల్లో ఉంది. అయినప్పటికీ స్టే నిబంధనలను పట్టించుకోకుండా అక్కడ కొత్తగా గుడిసెలు నిర్మించడం, షెడ్లు ఏర్పాటు చేయడం, వ్యాపారాలు నిర్వహించడం వంటి కార్యకలాపాలు కొనసాగుతున్నాయని స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో హైడ్రా రంగంలోకి దిగింది. బుధవారం ఆక్రమణలను తొలగించి భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేసింది.

**కబ్జాల కథలు వెల్లడి**

హౌసింగ్ బోర్డు రహ్మతుల్లా నుంచి భూమి సేకరించి లేఅవుట్ రూపొందించింది. గుడిసెలు ఉన్న 2 ఎకరాల భూమిని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అక్కడి నివాసితులకు కేటాయించారు. అయితే మిగిలిన 3 ఎకరాల భూమిపై వివిధ వర్గాలు తమదేనని తప్పుడు పత్రాలతో హక్కులు చెబుతున్నాయి. రామస్వామి అనే వ్యక్తి గుడిసెల వారికి కేటాయించిన భూమిని జీపీఏ ద్వారా విక్రయించడమే కాకుండా, పక్కనున్న 3 ఎకరాలపై కూడా కన్నేశాడని సమాచారం. మరోవైపు జాగీర్దార్ లక్ష్మణరావు పేరుతో, అలాగే రహ్మతుల్లా వారసుల పేరుతో వివిధ వ్యక్తులు, సంస్థలు భూమి తమదేనని చెప్పుకుంటూ వచ్చారు. వీరి వెనుక రాజకీయ నాయకుల మద్దతు ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వివాదాల నేపథ్యంలో హైడ్రా అన్ని వర్గాల పత్రాలను పరిశీలించి అవి చెల్లవని నిర్ధారించింది. చట్టాన్ని అతిక్రమిస్తూ కొనసాగుతున్న ఆక్రమణలను తొలగించి భూమిని ప్రభుత్వ అధీనంలోకి తీసుకుంది.

# భీమేశ్వర స్వామి సేవలో హెచ్‌సీఏ కార్యదర్శి

**ప్రజానావ, వేములవాడ:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న స్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామివారిని బుధవారం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (ఉప్పల్ స్టేడియం) కార్యదర్శి తమిడిశెట్టి బసవరాజు దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ ఆంజనేయ స్వామివారిని కూడా దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ దర్శన కార్యక్రమంలో ఆయన వెంట చక్రధర్ గౌడ్ పాల్గొన్నారు.



